క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్ కోట దిబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8న నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాటి పేట, బావిశెట్టి వారి పేట, నల్ల దిబ్బ, కెనాల్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

గణపవరం: గణపవరంలోని పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఈనెల 8వ తేదీ సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు గణపవరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు. పార్టీ శ్రేణులంతా ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు ప్రకటించారు. గణపవరం వైఎస్సార్ కాలనీ, సరిపల్లె, పిప్పర తదితర గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంత్యుత్సవాలు నిర్వహించడానికి పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి.

దెందులూరు: అపర భగీరథుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కార్యాలయంలో (ఏలూరు అశోక్‌నగర్) నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ బాధ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని కోరారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

గణపవరం: మూతపడిన సీపీఎఫ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ వారు గణపవరం ఫ్యాక్టరీ వద్ద 30వరోజు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆదివారం కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు కూడా ఆందోళనలో పాలుపంచుకున్నారు. దశాబ్దకాలంగా లాభాల్లో నడుస్తున్న కంపెనీని అకారణంగా మూసివేసి కార్మికులు, ఉద్యోగుల పొట్ట కొట్టారని తమకు న్యాయం చేయాలని వారు నినాదాలు చేశారు. కలెక్టరు, కార్మిక శాఖ అధికారులకు ఎన్ని వినతులు చేసినా ఫలితంలేదని వారు వాపోతున్నారు. ఇంత వరకూ యాజమాన్యంలో స్పందన లేదని, అధికార యంత్రాంగం ఇప్పటికైనా పట్టించుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

శరీర, అవయవదానంతో పునర్జన్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనుకోని పరిస్థితుల్లో దురదృష్టకరంగా ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి అవయవాలను దానం చేయడం ద్వారా 18 మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని విశాఖపట్నంకు చెందిన సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ - ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక పత్తేబాదలోని శ్రీ సాయి రాధా మినీ ఫంక్షన్ హాల్లో మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శరీర దానం, అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అవయవ దానంపై పూర్తి సమాచారం అందించారు. శరీర దానం చేయాలంటే ఎలా దరఖాస్తు చేయాలో వివరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మని ఇవ్వడం కంటే జన్మ సార్థకత ఏముంటుందన్నారు. మట్టిలో కలిసిపోయే దేహానికి మరొక జన్మకు అవకాశం కల్పించగలగడం అరుదైన అవకాశం అని వివరించారు. శరీర దానం వైద్యవృత్తిలో అధ్యయనం నిమిత్తం ఉపయోగపడుతుందని, అవయవదానం వల్ల ఇతరులకు పునర్జన్మ ఇవ్వడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అధ్యక్షుడు అబ్బూరి సూర్యనారాయణ మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆశయాలను, సభ్యుల కృషిని వివరించారు. కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ నూతన సభ్యులను పరిచయం చేసి, సంస్థ కార్యక్రమాలను వివరించారు. ఈ శరీరదానం, అవయవదానం ఆవశ్యకతను, ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళతామన్నారు. తమ ట్రస్ట్ సభ్యుల నుంచే ఈ కార్యక్రమంలో దరఖాస్తులు నమోదు చేయడం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తిగల వారికి సహకారం అందించి ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.పండరినాథ్, వేమా హరినారాయణ పాల్గొన్నారు.



శరీర, అవయవ దానాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతా మహాలక్ష్మి

హత్యకు గురైన తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడికి నివాళి

ఏలూరు (టూటౌన్): హత్యకు గురైన తమిళనాడు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌కు జిల్లా బీఎస్పీ నాయకులు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. స్థానిక కొత్తరోడ్డులోని నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అఖిల భారత తపాల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యక్తులను హత్య చేయడం పిరికిపంద చర్య అని, ఇటువంటి హత్యాకాండలను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. దెందులూరు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు కరి అంబేడ్కర్ మాట్లాడుతూ ఆర్మ్‌స్ట్రాంగ్ వంటి నాయకుడ్ని కోల్పోవడం బీఎస్పీకి తీవ్ర నష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తల పూర్ణ మల్లికార్జున్, ఖండవల్లి స్వామి దాసు, బయ్యే వెంకటరమణ పాల్గొన్నారు.



తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి జీవో ప్రకారం కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్‌లు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఏలూరు జిల్లా కమిటీ సమావేశం ఆదివారం ఉదయం కొత్తబస్టాండ్ సమీపంలో గల సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బి.బాలరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశం వివరాలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జాన్ బాబు విలేకరులకు తెలియజేశారు. చింతలపూడి గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారి నాలుగేళ్లు గడుస్తున్నా మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చలేదని, కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని తెలిపారు. చింతలపూడి మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయని పక్షంలో ఆందోళన చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో నిర్వహించిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులు రూ.20 వేలకు సంబంధించి జీవో విడుదల చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు రూ.75 వేలు గ్రాట్యుటీ చెల్లింపునకు సంబంధించిన జీవో విడుదల చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల జీవో, క్లాప్ ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం అమలుకు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ నెల 10న దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఇచ్చిన డిమాండ్స్ డే కార్యక్రమంలో కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వినుకొండ రమేష్, లావేటి కృష్ణారావు, ఆర్ నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా నాయకులు జాన్ బాబు

నీట్ 2024ని రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నీట్ 2024 పరీక్షను రద్దుచేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్షపై పలు సందేహాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నా, మరో వైపు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడానికి ఇష్టపడటం లేదని కాకి నాని అన్నారు. 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై మాట్లాడడానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ముందుకు రాకపోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నాని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థను రద్దుచేసి నిష్పక్షపాతంగా వ్యవహరించే స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారానే ఈ దేశంలో ఉండే విద్యార్థుల భవిష్యత్తుకి భరోసా కల్పించగలమన్నారు. స్థానిక విషయమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి స్థలం కేటాయించి దాదాపు రెండేళ్లు కావస్తున్నా నేటికీ శాశ్వత భవనాల వైపు ఒక అడుగు కూడా పడకపోవడం వల్ల విద్యార్థులు క్లాసులు సరిగ్గా నడవక ఇటు ఇంటర్మీడియట్ విద్యార్థులు మరొక వైపు డిగ్రీ విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోతున్నారని నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వెంటనే శాశ్వత భవనాలకు టెండర్లు పిలిచి నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, లేకపోతే ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎస్.క్రాంతి నగర సభ్యులు, ఎస్.యశ్వంత్, సీహెచ్ చందన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బడేటి చంటికి వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



వేగివాడలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

దెందులూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేగివాడలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళీకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎంతో మంది ఉద్యమ నాయకులు, కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దెందులూరు ఇన్‌చార్జి జొన్నకూటి జాన్, ఎర్రా ఆనంద్, ఉప్పులూరి ఏలీషా, రాంబాబు, కాట్రూ సూర్యచంద్రరావు, సురేష్, రామకృష్ణ, గ్రామస్తులు ఉన్నారు. తొలుత ఎమ్మార్పీఎస్ పతాకాన్ని మురళీకృష్ణ ఎగురవేశారు.

చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారులకు కేటాయించిన చెరువుల మీద శాశ్వత హక్కు కల్పించాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. అధికారులు ప్రభుత్వ జీవోలను అనుసరించకపోవడం వల్ల వృత్తిదారులకు తీవ్రనష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రజక సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా వృత్తి చెరువుల సమస్యలపై నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం పెద్దఅమిరంలో రజకుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఎర్రంపేటలో రజక సంఘానికి ఎంపీ నిధులు రూ.10 లక్షలతో రజక కమ్యూనిటీ హాలు నిర్మించాలని, చెరువులో పూడిక తొలగించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినట్లు చెప్పారు. అనంతరం 9 మందితో ఎర్రంపేట గ్రామ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలూరి శ్రీను, ఉపాధ్యక్షుడిగా దువ్వపు రాము, కార్యదర్శిగా బూరుగుపల్లి ధర్మయ్య, సహాయ కార్యదర్శిగా కానూరు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మున్నూరు సుబ్బారావు, సలహా సభ్యుడిగా దూదిగాం యేసయ్య, బూరుగుపల్లి చిన్న సత్యం, బూరుగుపల్లి దుర్గారావు, దువ్వ కొండలరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులను జిల్లా నేతలు అభినందించారు.



జిల్లా రజక సంఘం ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు మదనపల్లి జిల్లా హార్స్‌లీ హిల్స్‌లో నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర స్థాయి విద్యా,వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆదివారం ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా నుంచి ఎంపిక చేసిన 16 మంది ప్రతినిధులు ఈ శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిక చేసిన కార్మికవర్గ ప్రతినిధులకు నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారని అనంతరం శిక్షణ పొందిన ప్రతినిధులు ఆయా జిల్లాలో మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్, కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, దొడ్డిగర్ల నాగబాబు, కె.లోమి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నేత్రదానం

దెందులూరు: గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కొలుసు వీర వెంకటసత్యనారాయణ (62) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గుండె నొప్పి వస్తుందని ఆయన తన కుమారులకు చెప్పడంతో వారు వెంటనే దెందులూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లే లోపే ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మే 1న ఆర్టీసీ డ్రైవర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. సర్వీసులో ఉండగానే ఆయన మరణానంతరం ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలకు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది వచ్చి వీర వెంకటసత్యనారాయణ నేత్రాలను సేకరించారు.



కొలుసు వీరవెంకట సత్యనారాయణ (ఫైల్)

నాయకుల పరామర్శ: కొలుసు వీర వెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు కొలుసు నానిని వైఎస్సార్‌సీపీ నేత, సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, చల్లా మేరిరాజు పరామర్శించారు.

ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా జరజాపు రంగారావు

దెందులూరు: ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉండ్రాజవరానికి చెందిన జరజాపు రంగారావు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1990లోనే అప్పటి జిల్లా కలెక్టర్ అజయ్ కల్లాం నేతృత్వంలో అక్షర దీక్ష ఏలూరు డివిజన్ కోఆర్డినేటర్‌గా రాష్ట్రంలోనే విశేష సేవలందించిన కోఆర్డినేటర్‌గా రాష్ట్రప్రభుత్వం నుంచి స్పెషల్ అవార్డు, ప్రశంసాపత్రం పొందారు. వృత్తిరీత్యా హెచ్‌ఎంగా పనిచేస్తున్న రంగారావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు వీవీ రమణమూర్తి, లయన్స్ క్లబ్ డైరెక్టర్ సీహెచ్ అవినాష్ రాజు, ప్రోత్సాహంతో లయన్స్ క్లబ్ ఏలూరు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దెందులూరు మండలం ఉండ్రాజవరంలో ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ వృత్తిరీత్యా ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో విద్య, వైద్యం, సమాజ సేవ రంగాల్లో తన వంతు లయన్స్ క్లబ్‌కు సేవలందిస్తానన్నారు.



జరజాపు రంగారావు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	10, 15
బెండకాయలు	28	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	38
కాకర కాయలు	48	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	108
బీరకాయలు (పందిరి)	44	అల్లం	180
క్యాబేజీ	42	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-48	పాలకూర	15
దొండకాయలు	24	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	52

భారీ వర్షంతో పల్లపు ప్రాంతాల జలమయం

భీమడోలు: భారీ వర్షం కురవడంతో శనివారం రాత్రి భీమడోలులోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. 78.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనితో ఆదివారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు పలు చోట్ల వ్యాపారులు డ్రెయిన్లను పూడ్చి వేయడంతో వర్షపు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. రోడ్లపై గోతులు వర్షం నీటితో నిండిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో నీరంతా రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి వెళ్లే రహదారి, గుండుగొలను రాజుల ఏరియాలోని యూనియన్ బ్యాంకు వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరింది. దీనితో ప్రయాణికులు ప్రజలు ఆగచాట్లు పడ్డారు. పోలసానిపల్లి రహదారిపైకి నీరు చేరడంతో ప్రజలంతా వాటిలోనే తిరిగాల్సి వచ్చింది. డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపర్చితే నీరంతా కిందకు పారుతుందని ప్రజలు అంటున్నారు. ఇది ఇలా ఉంటే వరుణుడు కరుణించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వరి సాగు మరింత ఊపందుకోనుందని వారన్నారు. ఇప్పటికే డెల్టా ఏరియాల్లోని మెరక తూముల్లో నీరందక రైతులు ఇబ్బందులు పడుతుండగా భారీ వర్షం కురవడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి రోడ్డు వెంబడి వర్షపు నీరు

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

పెదపాడు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెదపాడు శాఖ నూతన కార్యవర్గం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం పెదపాడు కృష్ణా గురుకులం పాఠశాల వద్ద ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆలపాటి హనుమంతరావు, కార్యదర్శిగా గుండపనేని సురేష్, జుజ్జువరపు ఉమామహేశ్వరరావు ట్రెజరర్, సంయుక్త కార్యదర్శిగా చేవూరి వెంకట్రావు, ఈసీ ఆరోగ్యం వేల్పుల ప్రభాకరరావు, ఈసీ అవేర్‌నెస్ ఉప్పల రాజా రమేష్, ఈసీ విద్య ఆగోళ్ల శేఖర్, ఈసీ ఎమర్జెన్సీ గారపాటి రాజారామ్మోహనరావును ఎన్నుకున్నారు. అనంతరం సంస్థ అభివృద్ధిపై చర్చించారు. సభ్యులు కుకునూరి సీతారామకృష్ణారావు పాల్గొన్నారు.

విద్య,వైద్యాభివృద్ధికి విరాళం

దెందులూరు: విద్యాభివృద్ధి, వైద్యసేవల నిమిత్తం ఏలూరు లయన్స్ క్లబ్‌కు డైరెక్టర్ ఎస్ఎంసీ విద్యా సంస్థల అధినేత చుక్కా అవినాష్‌రాజు రూ. 10 వేలు, సభ్యులు రమేష్ రూ. 5 వేలు ఆదివారం అందజేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ విజయభాస్కరరెడ్డి, నూతన అధ్యక్షుడు జరజాపు రంగారావు, కోశాధికారి ఎస్.బాబికి దీనికి సంబంధించిన చెక్కు అందజేశారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

భీమడోలు: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ప్రతికూల పరిస్థితులు దాపురించాయి. కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్‌ను ప్రారంభించారు. రెండవ దుక్కులు చేసి వరి పంట వేస్తున్నారు. డెల్టా, మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు వేసే ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం సకాలంలో అందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా రైతులను ఆదుకుంది. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6 వేలకు తోడుగా రైతు భరోసా కింద గత ప్రభుత్వం రూ.7,500 జోడించి మొత్తంగా రూ.13,500 వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసి అన్నదాతలకు అండగా నిలిచింది. సాగు ఆరంభంలోనే ఏటా మే నెలలోనే తొలి విడతగా రూ.3,500 రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లోకి జమ చేసేది. అయితే రైతులకు ఈ ఏడాది నుంచి కొత్త ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం కింద రూ.20వేలను అందిస్తామని ప్రకటించింది. ఆ సాయం కోసం వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో రైతుల ఖాతాల్లోకి కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా గత నెలలో రూ.2వేల చొప్పున నగదును జమ చేసింది.ఈ సాయానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన నగదును జోడించి జమ చేయాల్సింది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పైసా విదల్చలేదు. కేంద్ర ప్రభుత్వం రూ.2వేల సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినందున ఈ సొమ్ములను రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు వాడేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో అందే అన్నదాత సుఖీభవ పథకపెట్టుబడి సాయం నగదు ఎప్పుడు జమ అవుతుందోనని వారంతా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి దీనిపై ఎటువంటి ప్రకటన రాకపోవడంతో వారంతా పెట్టుబడి కోసం అప్పులు చేయాలని దిగులు చెందుతున్నారు.

కౌలు రైతులకూ రైతు భరోసా

ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు ఆటవీ, దేవాదాయ భూములు సాగు చేస్తున్న వారికి వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది.

ఉంగుటూరు నియోజకవర్గంలో

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 40,597 ఏకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వారిలో భీమడోలు 13,362 ఏకరాలు, ఉంగుటూరు మండలంలో 23,672 ఎకరాలు, నిడమర్రు మండలంలో 3,536 ఎకరాలు, గణపవరం మండలాల్లో 11,713 ఎకరాల్లో అన్నదాతలు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో వరి నాట్లు వేశారు. పెట్టుబడి సాయం అన్నదాతలంతా ఎదురుచూస్తున్నారు.